# పట్నం పిల్ల

కాకాని కమల



భుజాన సంచీ వేసుకుని లోప లికి వస్తున్న కొడుకు నాగన్నని చూసి వీధి గడప దగ్గరే ఎదురొచ్చింది మంగమ్మ.

"ఏందిరా నాగన్నా! ఒక్కడివే వచ్చావ్? నీ పెండ్లాం ఏది?" అంది.

ఎర్రటి మట్టి రోడ్డు మీద బస్సు దిగి మూడు మైళ్ల దాకా పొలాల గట్ల మీంచి అడ్డం పడి నడిచి వచ్చాడు నాగేశ్వర్రావ్. ఉస్సూరుమంటూ సంచి తల్లికి అందించి "అది రానందే" అంటూ ఇంటి ముందరి మట్టి అరుగు మీద చతికిలపడ్డాడు.

మంగమ్మ బుగ్గలు నొక్కుకుంది. "ఏందిరా! ఈ ఇద్దూరం? కాపరానికి రానందా నీ పెళ్ళాం? ఎన్నాళ్లుం టుందట పుట్టింట్లో? ఎప్పుడొత్తుందట?" కొడుకుని నిల దీసింది.

నాగన్న తువ్వాలుతో ముఖం మీది చెమట అద్దుకున్నాడు. "ఎప్పటికీ ఆడనేవుంటుందట. ఇహ ఈ ఊరు రాదంట. నాకు పెండ్లాం, కొడుకు కావాలనుకుంటే, నన్నే ఆడికి వచ్చి వుండమంది. సేద్యంపన్లు ఆడ కూడా మస్తు దొరుకుతాయంట" అన్నాడు.

"అం...టే? ఇల్లరికం రమ్మందన్నమాట!"

"అలా అని కాదనుకో...కానీ..."

గయ్యిమంది మంగమ్మ. కొడుకు నసుగుతుంటే తాటాకు మంటలా భగ్గుమంది. "అందుకే నీకు పెళ్లికి ముందే చిలక్కి చెప్పినట్లు చెప్పారా? నీకు సదువు లేదు. ఆ పిల్లకి సదువుంది. పైగా నువ్వు పల్లెలో పుట్టి పెరిగావు. అది పట్నంలో పుట్టి పెరిగింది. మనకి వద్దురా అది. ఈ పల్లెలో నిలబడి కాపురం సెయ్యదురా అని నీ సెవిలో ఇల్లు గట్టుకొని పోరినా. పట్నం పిల్ల మనకి వద్దురా బిడ్డా అన్నా గాని నువ్వు నా మాట ఇనలేదు. సదివిన పిల్ల అయితే తెలివిగా సంసారం సేసుకుంటుంది. నాకు సేద్యం పనుల్లో సలహా ఇస్తుంది. పిల్లగాళ్లని బాగా పెంచుతుంది అన్నావ్! నాకెలాగూ అచ్చర గ్యానం లేదు. నా పెండ్లాం అయినా సదివింది అయితే బాగుంటుంది అన్నావు. అక్కడికి నాదే



సెప్పినా. నీ ఆలోచన బాగుంది కానీ సదివిన పిల్ల పట్నం పిల్ల మన మాట ఇనదురా అబ్బాయ్ అన్నా! కానీ నువ్వు నా మాట పెడసెవిన పెట్టావ్! సదుకొన్న పట్నం పిల్ల మీద మోజు పడ్డావ్. ఇప్పుడేం అయింది?"

అరచేతిని తల మీద పెట్టుకొని ఒక కాలు మడిచి ఇంకో కాలు బారజాపి గోడకి ఆనుకుని కూర్చున్నాడు నాగన్న. సర్వం పోగొట్టుకున్న వాడిలా దిగాలుగా! మళ్లీ మంగమ్మే అంది "ఇంతకీ నీ మావ ఏవన్నాడురా? నీ అత్తేమంది?"

"అది పోనంటే నేనేం చెయ్యనల్లుడూ? అయినా నా కూతురు సెప్పింది కూడా నిజమే కదా! ఓ రూపాయి డబ్బు తక్కువయినా పర వాలేదు. కానీ కాలో చెయ్యో అవుడు అయితే ఎట్టా? కన్నే పోయిందనుకో, ఎంత సంపా దించి ఎన్ని ఎకరాలుండి ఏం లాభం అన్నాడు నా మావ!"

మంగమ్మ పెటపెట మెటికలు విరిచింది. మూతి మూడు వంకర్లు తిప్పింది. వియ్యంకుడి మీద మట్టి చల్లినట్లు పిడికిళ్లు మూసి తెరి చింది.

"అట్లన్నాడా వాజమ్మ! వాజమ్మ మాటలు వాడూ! అల్లుడితో మాట్లాడవలసిన పద్ధతి అదేనా అంట? మరి ఇంతకి మీ అత్త ఏమం టుంది?" కళ్లు చికిలించింది మంగమ్మ. ముం దుకి వంగి కొడుకు ముఖంలోకి చూస్తూ "ఆళ్ళంతా ఒకటేరా! ఆళ్ళ కూతురు సదివింది. ఆమె చెప్పేదే పెమాణం. సత్తెం! అంతేగా సెప్పింది నీ అత్త?"

నాగన్న తల దించుకున్నాడు. గొణుగు తున్నట్లు అన్నాడు. "ఆఁ అంతే అందిలే! మీ ఊళ్ళో ఉంటే నీ కొడుకు ఆరోగ్యం పాడయి తుంది అల్లుడూ! తెల్సి తెల్సి ఎవురన్నా విషం కూడు తింటారా? మేం అంతా సెప్పేది నీ మంచి కోసమే అల్లుడు. నువ్వు ఈడకే వచ్చెయ్యి. అంతా కలిసి ఈడనే ఉందాం అంది" అన్నాడు.

"అహాఁ! అంటే నిన్ను ఇల్లరికం రమ్మనేగా!"

"అలా అని కాదు. మనూరి సమస్యలు పరిష్కారం అయ్యేదాకా అందర్నీ ఆడనే వుండ మంటున్నారు. అక్కడే ఏదో తెరువు చూపిస్తాం అంటున్నారు మా అత్త, మావ. నాకు ఏదన్నా పని ఇప్పిస్తామంటున్నారు" అన్నాడు. మం గమ్మ చేతులు తిప్పింది.


పెటపెట శబ్దం వచ్చేలా చేతులు కొడుతూ "అహాఁ అట్టాగంటనా! ఈ ఊరి సమస్యలు అంత తొందరగా పరిష్కారం అయ్యే మాటేనా? కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి ఇక్కడ కట్టిన ఫ్యాక్టరీలు అంత తొందరగా మూసేస్తారం టనా? ఎప్పటికప్పుడు మనూరి వాళ్లందరం పోయి సర్కారు వాళ్ళ ముందు మొత్తుకుంటూనే ఉన్నాం. మంత్రులు మారుతున్నారు! సర్కారు మారుతుంది! కానీ మన బతుకులు మారుతు న్నాయా? ఈ ఫ్యాక్టరీలు మారుతున్నాయా? ఏదీ లేదు! అట్లాంటిది ఇప్పుడు నీ పెళ్ళాం ఈ ఊరికి కోడలుగా వచ్చిందని, చనంలో ఇక్కడి పరిస్థితులు మారిపోతాయా? ఆడది అన్నాక తాళి కట్టిన మగని వెంట అడవిలోకి అయినా నడిచి వెళ్ళి కాపురం చెయ్యాలిగాని! ఆనాటి సీతమ్మ కంటే ఎక్కువదా నీ పెళ్ళాం? నిన్నగాక మొన్న పుట్టిన నీ కొడుకంటే నీ పెళ్ళానికి అంత బెముంటే పాతికేళ్ళు పెంచిన నువ్వంటే నాకుండదంటనా పేమ?

అయినా నీ పెళ్ళాం మనింటికి రావాలి



**కొత్త శిశువు** (మినీ కవితా సంపుటి ఆవిష్కరణ)

***డిసెంబరు 29 న ద్వారకానగర్, విశాఖ ప్రాంతీయ గ్రంథాలయంలో గుడిమెట్ల గోపాలకృష్ణ మినీ కవితా సంపుటి 'కొత్త శిశువు' శ్రీ మోటూరి శ్రీరామకృష్ణగారి చేతుల మీదుగా ఆవిష్కరింపబడింది. ప్రధాన వక్తలుగా శ్రీ మాధవీ సనారా (ఖర్గ్‌పూర్), శ్రీ గుండాన జోగారావు (రాయగడ) వ్యవహరించారు. శ్రీ గంగసాని కృష్ణారెడ్డి, కోవెల స్పందన సాహితీ సమాఖ్య ద్వారా సభను నిర్వహించారు. ఈ సంపుటిని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అయిన శ్రీ మండా జగన్నాథం గార్కి అంకితం ఇవ్వబడింది.***



## శాస్త్రీయం - శ్రీశ్రీయిజం

జీర బోయినది గళం - కానీ మహా
గానాల్నే
వినిపించడం శాస్త్రీయం
జవ బలం లేనిది జన దళం -
దానితోనే హాహాకారాలను
విలపించడం శ్రీశ్రీయిజం
అదీ కలమే.. ఇదీ కలమే - అనర్గళపు
అనితర గళమే
కొమ్మల్లో, రెమ్మల్లో - కూనలమ్మ,
కోయిలమ్మ
మధురిమపు గానాలే - శాస్త్రీయం
లోయల్లో కోయలతో - కూడులేని
గూడుల్లో
గోడు వినని మోడులకు
తన కలమే.. శ్రీశ్రీయిజం
అదీ కలమే... ఇదీ కలమే - అనర్గళపు
అనితర గళమే
గురువింద గింజ వర్ణ వర్ణనే -
పొన్నపూలపై తుమ్మెద ఝుంకారం -
శాస్త్రీయం
గురువింద గింజ వర్ణ వర్ణమే -
పొగగొట్టపు
ఘీంకారం - శ్రీశ్రీయిజం
అదీ కలమే నిదీ కలమే - అనర్గళపు
అనితర గళమే
పున్నాగ మల్లి సుగంధంతో కలం
స్ఖలిస్తే - పన్నీరైతే



శాస్త్రీయం
పుడమి తల్లి అనాధ నవ్వులో కలం
జ్వలిస్తే - రుధిరపు
కన్నీరైతే శ్రీశ్రీయిజం
అదీ కలమే ఇదీ కలమే - అనర్గళపు
అనితర గళమే
కవి హృదయం కవ్వించే - కవితై
నవతను పులకించె
తన గోడును జన గ్రోలగ
పలికించడం శాస్త్రీయం
కవి హృదయం ద్రవించీ - కవితై
యువతను రగిలించీ
జన గోడును తన గాథగా
విలపించడం శ్రీశ్రీయిజం
అదీ కలమే ఇదీ కలమే - అనర్గళపు
అనితర గళమే
ప్రకృతి సృష్టి లోనైనా - అలంకృత
దృష్టికి లోనైనా
కవి హృదిన జనించినా, జ్వలించినా -
కవి హృదయం కవ్వించినా,
రగిలించినా
నవతై నవ్యత నిస్తుంది - సమతై
పరిభ్రమిస్తుంది
అ కలమయినా ఆ కాలమయినా
ఈ కలమయినా ఈ కాలమయినా
కవిత జన్మ ధన్యమే స్థిత ప్రజ్ఞకు

- సుమూర్తి

గానీ నువ్వు అళ్ళింటికి వెళ్ళటం ఏంటిట? ఇక్కడ నేనేం గావాలా?"

"నిన్ను కూడా రమ్మంటున్నారే?" నాగన్న తలెత్తి తల్లి ముఖంలోకి చూశాడు.

ఉరుము ఉరిమి మంగలం మీద పడినట్లు విరుచుకుపడింది మంగమ్మ. "నే సచ్చినా రాను. నువ్వు వెడితే వెళ్ళు వాజమ్మలా! పెళ్ళాం కొంగట్టుకు తిరుగు! ఆళ్ళ బర్రెలు గొర్రెలు కడుగు. బంగారం లాంటి పొలం, సొంత సేద్యం, సొంతిల్లు, వాకిలి, పాడి, స్వంత ఊరు వదులుకుని పెళ్ళాం ఊరెళ్ళితే నాలుగు దినాల్లో రోగం కుదురుతుంది. నున్నగా గుండు గొరికి పంపిస్తారురా వాజమ్మా! ఉన్న వారు కన్న తల్లి ఎట్టాంటిది అయినా భరించాలిరా! నాగలి పట్టి భూమిని నమ్ముకున్న వాల్లం. కష్టం సుఖం ఓర్చాలిరా. ఊళ్ల సమస్యలు శానా ఉన్నాయి. సర్కారుకి మొర పెట్టుకుంటున్నాం. ఆళ్లు ఇంటున్నారు. అది సేత్తాం. ఇది సేత్తాం అంటున్నారు. ఈ సమస్య మన ఒక్కరిదేనా? ఈ ఊళ్ళో చుట్టు ప్రక్కల వెయ్యి గడపల దాకా ఉన్నాయి. వాళ్ళకి లేవా సమస్యలు. అందరూ తాగే నీరు ఒకటే. మరి ఆళ్ళంతా ఊళ్ళు వదిలి పారిపోతున్నారా? మనూరికి నీళ్ళ సమస్య తీరుస్తాం అని పేపర్ల నిండా ఏదో రాత్తున్నారుగా! నీ పెళ్ళాం సదువుకొందిగా! మరి ఆ విషయం తెల్వదంటనా? అడగలేక పొయ్యావా?" అంది.

"అడిగానే! కానీ పేపర్లో రాసిందంతా అయ్యేది ఎప్పటికో! ఈలోగా నాకూ, నా కొడుక్కి కాలో చెయ్యో వంకర పోతుంది. పిసి బిడ్డలకి ఇంకా తొందరగా రోగం అంటుతుంది. నా కొడుకుని చేతులారా కుంటోడ్నో, గుడ్డోడ్నో చెయ్యలేను అంటుంది" అన్నాడు నాగన్న భార్యని సమర్థిస్తూ.

"అహ! అలాగనా! యాభై ఏళ్ళుగా నేను, పాతికేళ్ళుగా నువ్వు ఈ ఊళ్లోనే వున్నాంగా. మరి కుంటోల్లం, గుడ్డోల్లం అయినామా?"

"ఊళ్ళో శానామంది అయినారుకదే! చూపు పోయి ఏనుగు కళ్ళు పడి, దొడ్డి కాళ్ళు వచ్చి, ముంగాళ్ళు వంకరపోయి...నా పెళ్ళాంకి తను కూడా ఈ నీళ్ళు తాగితే అట్ట అయితానని భయ్యం! ఈడ చుట్టు ప్రక్కలంతా చాలా ఫ్యాక్టరీలు వున్నాయి. ఆళ్ళు వదిలే రసాయనాలు చెరువుల్లో బావుల్లోకి చేరుతున్నాయి. ఆ రంగు నీళ్ళు నేలలోకి ఇంకిపోయి పంటలు విషం అవుతున్నాయి అంటోంది నీ కోడలు" అన్నాడు నాగన్న.

నాగన్న భార్య పద్మ పదిదాకా చదివింది. పిల్ల బాగుంది. అల్లుడికి కట్నం ఇచ్చే స్థితి తల్లిదండ్రులకి లేదు. అయినా పద్మ ఫ్యాషన్‌గా వుంది, చదివిందని మోజు పడ్డాడు నాగేశ్వరావు. "నువ్వు బడి ముఖం ఎరుగవు. చదివిన పిల్లతో ఏగలేవు" అంది తల్లి.

కానీ నాగన్న మోజు పడ్డాడు. ఒక్కగానొక్క కొడుకు అని మంగమ్మ చదివిన కోడల్ని తెచ్చుకుంది. కానీ పద్మ కాపురానికి వచ్చిన ప్పటి నుంచి అత్తింట ముళ్ళ మీద వున్నట్లు వుంటుంది. చుట్టు ప్రక్కలన్నీ రసాయన ఫ్యాక్టరీలు. వాటి కలుషితాల్ని పంట బోదెల్లోకి, మురికి కాలువల్లోకి వదులుతున్నారు. వాటి పొగలు మేఘాల్లో ఆవరిస్తాయి. నీళ్ళు బాగా కలుషితం అయి పచ్చగా ఉంటాయి. చెరువు నీళ్ళే ఆ గ్రామాలన్నింటికీ ఆధారం. ఆ నీళ్ళు

త్రాగిన గ్రామస్తులందరూ జబ్బులు పడుతున్నారు. రకరకాల రోగాలు వస్తున్నాయి. కంటి చూపు మందగించటం, కళ్ళు వంకర పోవటం, నరాలు పీక్కుని పోవటం, ఏనుగు కాళ్ళు రావటం...

ఇదంతా పద్మకి భయం కలిగించింది. అస్తమానూ పుట్టింటికి వెళ్ళిపోయేది. నాగన్న బ్రతిమాలి తెచ్చేవాడు. పెళ్ళయిన ఆరు నెల్లకే నీళ్ళోసుకుంది పద్మ. ఐదవ నెల రాగానే పుట్టింటికి పోయింది. పురుడు అయింది. కొడుకు పుట్టాడు. ఇప్పుడు వాడికి ఐదవ నెల వస్తుంది. అయినా తిరిగి అత్తింటికి రాలేదు. సరికదా! ఆ ఊరిలో ఫ్యాక్టరీలు మూసేసి, మంచి నీళ్ళు వచ్చేదాకా రానని భీష్మించుకుంది. పుట్టింట్లోనే ఉంటానంటోంది. సరికదా! భర్తని, అత్తని కూడా అక్కడికే వచ్చెయ్యమంటోంది. అక్కడ రాత్రి బళ్ళో టీచరు ఉద్యోగం కూడా సంపాదించుకుంది.

సొంత సేద్యం, స్వంత ఇల్లు, పాడి వదులుకుని వేరే ఊరు వలస అంటే మంగమ్మకి, నాగన్నకి కొరుకుడు పడటం లేదు.

రోగం వచ్చిందని కన్నతల్లిని వదులుకుంటామా? మంగమ్మ ససేమిరా అంటోంది. నువ్వు వెడితే వెళ్ళు, నే రాను అని నిక్కచ్చిగా తేల్చేసింది.

నాగన్నకి పెళ్ళాం మాట రైటనిపిస్తుంది. "పోనీ కొంత కాలం అత్తింట ఉంటే"... అనిపిస్తుంది. పూల చెండులా వున్న కొడుకుని రోజూ ఎత్తుకుని ముద్దాడవచ్చు. పెళ్ళాంతో సరదాగా ఉండొచ్చు...నాగన్న మనసు, వయసు ఉవ్విళ్ళూరుతున్నాయి. "వాజమ్మ... వాజమ్మని" అంటుంది తల్లి. "నువ్వు పోతే పో...నేను రాను" అని తేల్చేసింది. ఏం చెయ్యాలి?

ఈ సమస్యకి పరిష్కారం ఏమిటి? ఫ్యాక్టరీలు మూసెయ్యటం, నీళ్ళు తేట పడటం అంత తొందరగా అయ్యే పరిష్కారం కాదు. పరిష్కారం అయి నీళ్ళు శుభ్రపడందే పద్మ కాపురానికి రాదు. తల్లి చెప్పినట్లు నేను చదువుకున్న పిల్లని చేసుకుని తప్పు చేశానా?

కన్న తల్లిని వదిలి అత్తింట చేరితే లోకం ఉయ్యదా? అమ్మ అక్కడికి రాదు. పద్మ ఇక్కడికి రాదు. ఏం చెయ్యాలి?

శుభ్రమైన నీళ్ళు తాగుతామన్న ఆశకి నీళ్ళు వదులుకుని ఉన్న ఊరు వదులుకుని పోవాల్సిందేనా? లేకపోతే సంసారానికి నీళ్ళు వదులుకోనా? నాగన్న గుడిసె ముందు మట్టి అరుగు మీద నెత్తిన చెయ్యి పెట్టుకొని, ఒక కాలు మడిచి, ఒక కాలు బారా చాపి గోడకి ఆనుకుని కూర్చున్నాడు.

తల నిండా పూలు పెట్టుకొని పుస్తకం చదువుతున్న భార్య కళ్ళ ముందు కదులుతోంది.

కిలకిలా నవ్వే కొడుకు ఊరిస్తున్నాడు.

గుడిసెలో మంగమ్మ బియ్యం చేట చెరుగుతూ 'వాజమ్మ వాజమ్మ' అని సణుగుతోంది.

'నేను వాజమ్మని అనిపించుకోనా? వద్దా? ఏం చెయ్యాలి?' నాగేశ్వర్రావు మనసు డోలాయమానంగా వుంది. ❋

---

# ఉత్తరాలు

## కవిత బాగుంది

ఆరోగ్యకరమైన ఎన్నో సూచనలు, చిట్కాల కోసం మార్కెట్లో ఎన్నో పుస్తకాలుంటాయి. అయితే అవి కొనుక్కు చదివే వాళ్ళు తక్కువ. అదే డాక్టర్ల చేత వ్యాసంగా రాసి 'ప్రియదత్త' లాంటి వీక్లీలో వేస్తే ఎంతోమందికి ఉపయోగకరం. సంపాదకవర్గం ఆ సంగతి గుర్తించినందుకు ధన్యవాదాలు. గాయత్రి గారి కవిత 'గణతంత్ర స్వరాజ్యం' ఎన్నోసార్లు చదివాను. సామాజిక స్పృహ గల కవిత.

***- జి.జి.కె. రావు, విశాఖపట్నం***

## పవన్ క్రేజ్ ఇప్పటికీ తగ్గలేదు

'పవన్‌కు అనుకూల పవనాలు' అంటూ పులిగిళ్ల నర్సింగ్‌రావుగారు పవన్‌కళ్యాణ్‌కి ఇమేజ్ తగ్గిపోయినట్లుగా ఆ వ్యాసంలో రాసారు. కాని నాలుగు ఫ్లాపులు వచ్చినంత మాత్రాన ముందు సంపాదించుకున్న క్రేజ్ ఎక్కడికీ పోదు అని రచయిత గమనించాలి. పవన్ పిక్చర్ విడుదల అవుతుందంటే అభిమానుల్లో ఉండే ఉత్సాహం అంతా ఇంతా కాదు. రచయిత అన్నీ గమనించి, పరిశీలించి ఒక నిర్ణయానికి రావాలి. మా అభిమాన నటుడు పవన్ కళ్యాణ్‌ని ముఖచిత్రంగా ప్రచురించినందుకు కృతజ్ఞతలు.

***- వి. నిరంజన్, పాలకొల్లు***

## నిజంగా అర్హుడాయనే!

నటుడు కమలహాసన్‌కి డాక్టరేట్ ఇవ్వడం ఎంతయినా సముచితం. నటులలో డాక్టరేట్ పొందడానికి ప్రప్రథమ అర్హుడు కమలహాసనే. ఇప్పటికే ఈ విషయంలో యూనివర్సిటీలు ఆలస్యం చేశాయని నా అభిప్రాయం. 'ప్రియదత్త'లోని కథలు బాగున్నాయి. విశ్వ ప్రసాద్ గారి సీరియల్ చక్కగా సాగుతోంది. ఎమ్.వి.ఎస్. ప్రసాద్‌గారు ప్రతివారం రైళ్ళకు సంబంధించిన పలు కొత్త విశేషాలను తెలియపరుస్తున్నారు. ఆయన ఎంతైనా అభినందనీయుడు. మంచి ఉపయోగకరమైన సమాచారం.

***- వి. లీలావతి, నెల్లూరు***

## బంగారు భవితకై పాటుపడేదెవరు?

9.02.2005 సంచిక 'వేదిక'లో ఎన్.వి.ఎస్. ఆర్.ప్రసాద్‌గారు తమ ఉద్దేశాన్ని నిక్కచ్చిగా చెప్పారు. ఆయన అభిప్రాయంతో నేను ఏకీభవిస్తున్నాను. కోటలు దాటే మాటలతో ఓట్లు అడగడానికి వచ్చిన రాజకీయ నాయకులకు, ఆ తర్వాత అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టదని ఇప్పటికి ఎన్నోసార్లు రుజువైంది. నాయకులు నడుం బిగించినప్పుడే ఏదయినా సాధ్యమవుతుంది. మరి పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ఎంతమంది నాయకులు పాటుపడుతున్నారు? పత్రికల్లో బాహాటంగా ప్రకటనలిచ్చే నాయకులు తమ ఇళ్ళలో ఎంతమంది పిల్లల చేత వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారు. దాన్ని ఎవరు అరికట్టాలి? అది ఎవరికి సాధ్యం? ఇలాంటి లొసుగులకి చికిత్స చేసినప్పుడే బాలల భవితవ్యం బంగారు బాటపై నడుస్తుంది. నా ఉత్తరం చదివి ఒక్కరు మారినా ఆనందమే.

***- కె.వి.ఎస్. రామశర్మ, బద్వేల్***

## రచయితకి అభినందనలు

అమీషా పటేల్ ముఖచిత్రంతో వచ్చిన 'ప్రియదత్త'లో '(కు)సంస్కారం' కథ చాలా బాగుంది. రచయిత్రి కోపూరి పుష్పాదేవిగారికి అభినందనలు. ఎదుటి మనిషి గురించి ఏమీ తెలుసుకోకుండానే అంచనా వేసే మనస్తత్వం చాలామందిలో కనిపిస్తుంది. దీనివల్ల ఎన్నో అనర్థాలు కలుగుతాయి కూడా. ఈ సున్నితమైన విషయాన్ని '(కు)సంస్కారం' కథ ద్వారా పుష్పాదేవిగారు చక్కగా తెలియపరిచారు. కథ బావుంది. కార్టూన్లు కడుపుబ్బ నవ్విస్తున్నాయి.

***- వి. ప్రభావతి, ఎడ్లపాడు***